క్లుప్తంగా

విమ్స్‌కు రెండు బ్యాటరీ కార్లు



కార్ల తాళాలు విమ్స్ డైరెక్టర్ రాంబాబుకు అందజేస్తున్న డాక్టర్ శివానంద్

మహారాణిపేట: కేజీహెచ్‌లో ఉన్న రెండు బ్యాటరీ కార్లను విమ్స్‌కు అప్పగించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ సహకారంతో మొత్తం ఆరు బ్యాటరీ కార్లు కొనుగోలు చేసి కేజీహెచ్‌కు అప్పగించారు. వాటిలో రెండింటి తాళాలను మంగళవారం విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబుకు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ అందజేశారు.

ఉచిత పశువైద్య శిబిరం నేడు

ఆరిలోవ : జీవీఎంసీ 13వ వార్డు పరిధి విశాఖ కేంద్ర కారాగారం ఎదురుగా రామకృష్ణాపురంలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు చినగదిలి మండలం పశు వైద్య సహాయ సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఉచిత పశువైద్య శిబిరాల్లో భాగంగా ఇక్కడ శిబిరం నిర్వహించనున్నామన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభంకానున్న శిబిరాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. దారపాలెం, పైనాపిల్‌కాలనీ, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, చినగదిలి తదితర ప్రాంతాల పాడి రైతులతోపాటు ఇతర ప్రాంతాల వారు కూడా పశువులను శిబిరానికి తీసుకురావచ్చని తెలిపారు. ఇక్కడ ఉచితంగా మందులు పంపిణీ చేసి, టీకాలు వేయడంతోపాటు రైతులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.

తుప్పల తొలగింపు



తుప్పలు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు పందిమెట్ట ప్రాంతంలో పెద్ద మొత్తంలో తుప్పలు పేరుకుపోయి పాములకు నివాసంగా మారడంతో జీవీఎంసీ సిబ్బంది వాటిని తొలగించారు. ఆదివారం ఆ ప్రాంతంలో ఒక వ్యక్తికి పాము కాటు వేయటంతో స్థానికులు భయాందళనలకు గురయ్యారు. దీంతో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పల్లా దుర్గారావుకు సమస్య చెప్పటంతో ఆయన జీవీఎంసీ అధికారులతో మాట్లాడి మంగళవారం తుప్పలను తొలగించారు.స్థానికులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

గోతుల రోడ్డే దిక్కు



బీఆర్‌టీఎస్ వైపు విమ్స్ ద్వారం వద్ద శిథిలమైన రోడ్డు



గోతుల రోడ్డులో ఇబ్బంది పడుతూ విమ్స్ లోపలకు వెళ్తున్న వాహనచోదకులు

అధ్వానంగా విమ్స్ రహదారి

ఇబ్బందిపడుతున్న రోగులు

ఆరిలోవ : విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్) రోడ్డు శిథిలావస్థకు చేరింది. గోతులు పడిన ఈ రోడ్డుపై విమ్స్‌కు వైద్యం కోసం వెళ్తున్న వేలాది మంది రోగులు నిత్యం ఇబ్బంది పడుతున్నారు. విమ్స్‌కు జాతీయ రహదారి వైపు ఓ ప్రవేశ ద్వారంతోపాటు బీఆర్‌టీఎస్ రోడ్డు వైపు మరో ప్రవేశ ద్వారం ఉంది. ఆస్పత్రి లోపల పలుచోట్ల రోడ్లు స్వల్పంగా శిథిలమయ్యాయి. బీఆర్‌టీఎస్ రోడ్డు వైపు ప్రవేశ ద్వారం నుంచి ఉండే రోడ్డు మాత్రం పూర్తిగా శిథిలమైంది. కొన్నిచోట్ల ప్రయాణించడానికి వీలులేని విధంగా పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఇక్కడ ప్రవేశ ద్వారం వద్ద ఫుట్‌పాత్, రోడ్డు భాగం పూర్తిగా శిథిలమయ్యాయి. ఫుట్‌పాత్‌పై పలకలు ఊడిపోయాయి. సీసీ రోడ్డు గోతులు పడి రాళ్లు పైకి తేలిపోయాయి. దీని నుంచి విమ్స్ లోపలకు సుమారు 100 మీటర్ల పొడవున రోడ్డు గోతులుపడింది. ఇక్కడ సీసీ రోడ్డు కొంత భాగం, ఇంకొంత భాగం బీటీ రోడ్డు ఉంది. సీసీ రోడ్డుకు బీటలు పడగా, బీటీ రోడ్డు గోతులు పడింది. దీంతో ఆ రోడ్డుపై విమ్స్‌కు రోగులను తీసుకెళ్లే ద్విచక్ర వాహనచోదకులు, ఆటోలుపై తీసుకెళ్లే వారు ఇబ్బంది పడుతున్నారు. ఈ గోతుల్లో కొందరు ప్రమాదాలకు గురవుతున్నారు.

పోలీస్ స్టేషన్‌కూ ఇదే దారి..

నెల రోజుల క్రితం ప్రారంభించిన ఆరిలోవ పోలీస్ స్టేషన్‌కు వెళ్లడానికి కూడా ఈ గోతుల రోడ్డే దిక్కు కావడం విశేషం. పోలీస్ స్టేషన్‌కు ప్రస్తుతం ప్రత్యేకంగా దారి లేదు. దీంతో బీఆర్‌టీఎస్‌ను ఆనుకుని విమ్స్ ప్రవేశ ద్వారం నుంచే లోపలకు వెళ్లి చేరుకోవాలి. పోలీసుల వాహనాలతోపాటు స్టేషన్‌కు అవసరాల కోసం వెళ్లాల్సిన వారికి కూడా ఇదే దారి. దీంతో నిత్యం ఈ రహదారి రద్దీగా ఉంటుంది. జీవీఎంసీ అధికారులు, విమ్స్ అధికారులు ఈ రోడ్డుపై దృష్టి సారించి నిర్మించాలని పలువురు కోరుతున్నారు.



గోతులు పడిన విమ్స్ రోడ్డు

గోతుల వల్ల ఇబ్బందులు

విమ్స్‌కు వెళ్తున్నప్పుడు ఆరిలోవ నుంచి బీఆర్‌టీఎస్ ద్వారం వైపు లోపలకు వెళ్లాలి. ఈ రోడ్డులో ఎక్కువ చోట్ల గోతులుపడ్డాయి. నాలుగు రోజులుగా మా అమ్మను బైక్‌పై ఆస్పత్రికి తీసుకెళ్తున్నా. గోతులు వల్ల బైక్ పైనుంచి ఆమె జారిపోయి కింద పడిపోతుందేమోనని భయం వేస్తోంది. వేలాది మంది రోగులు నిత్యం ఉపయోగించే రోడ్డును పునర్నిర్మించాలి.

– ఎస్.సత్యనారాయణ, ఆరిలోవ

రోడ్డు పునర్నిర్మించాలి

బీఆర్‌టీఎస్ వైపు విమ్స్ ద్వారం మరింత శిథిలమైంది. ఇక్కడ రాళ్లు పైకి తేలిపోయి గోతులుపడ్డాయి. ఇక్కడ ప్రవేశించడానికే ఇబ్బందిగా ఉంది. లోపల రోడ్డు పరిస్థితి కూడా ఇదే మాదిరిగా మారింది. ఈ రోడ్డును కొత్తగా నిర్మించాలి. జీవీఎంసీ అధికారులు, పాలకులు తక్షణమే స్పందించి ఆ దిశగా చర్యలు చేపట్టాలి.

– కె.నర్సింహం, పెదగదిలి

ఘనంగా కైలాసనాథుడి ఆలయ వార్షికోత్సవం



కైలాసనాథుడికి పూజలు చేస్తున్న భక్తులు

ఆరిలోవ: పర్యాటక కేంద్రం కైలాసగిరిపై కైలాసనాథుడి ఆలయం 74వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని అర్చకుడు కాశీబాబు, వీఎంఆర్‌డీఏ సిబ్బంది వివిధ రకాల పూలతో అలంకరించారు. మంగళవారం ఉదయం నుంచి ఇక్కడ స్వామికి పూజలు చేశారు. విశాలాక్షినగర్, అప్పుఘర్ ప్రాంతాలతోపాటు వీఎంఆర్‌డీఏ సిబ్బంది స్వామికి పూజలు చేశారు. కోలాటం, భజన కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నసమారాధన చేపట్టారు. భక్తులు, కైలాగిరి సందర్శకులు అధిక సంఖ్యలో స్వామి ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా అర్చకుడు మాట్లాడుతూ ఓంకార స్వామీజీ కొన్ని దశాబ్దాల క్రితం ఇక్కడ శివలింగాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఆయన 131వ జయంతి, ఆలయ వార్షికోత్సం సందర్భంగా ప్రతి సంవత్సరం ఉత్సవాలు జరుపుతామన్నారు.

ఘనంగా అప్పలమ్మ తల్లి పండగ



అప్పలమ్మ తల్లికి సారె తీసుకెళ్తున్న కార్పొరేటర్ మువ్వల లక్ష్మి తదితరులు

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20వ వార్డులోని చినవాల్తేరులో కొలువైన అప్పలమ్మ తల్లి పండగను మంగళవారం స్థానికులు ఘనంగా నిర్వహించారు. ఈ పండగలో భాగంగా స్థానిక మహిళలతో కలిసి వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి సారెను అమ్మవారికి సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మెరుగైన వసతుల కల్పనకు ఆదేశాలు జారీ



అధికారులతో సమీక్షిస్తున్న వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని హాస్టల్ విద్యార్థులకు వసతులు మెరుగుపరచాలని వైస్ ఛాన్స్‌లర్ జి. శశిభూషణరావు సూచించారు. వర్సిటీ కాలేజీ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలపై విద్యార్థులు నిరసన గళం ఎక్కుపెట్టి, వీసీ భవనం ముందు ఆందోళన చేసిన నేపథ్యంలో అధికారుల్లో చలనం వచ్చింది. పరిస్థితి మరింత చేయి దాటకముందే చక్కదిద్దే ప్రయత్నంలో భాగంగా వర్సిటీ కాలేజీల ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులతో మంగళవారం ఎకడమిక్ సెనేట్ హాల్లో వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ సమావేశమై పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సంక్రాంతి సెలవుల అనంతరం తరగతులు ప్రారంభమయ్యాయని, ప్రతి విభాగంలో పటిష్టంగా బోధన జరగాలని స్పష్టం చేశారు. ప్రిన్సిపాల్ విభాగాలతో సమన్వయం చేస్తూ వీటిని పర్యవేక్షించాలని చెప్పారు. అదే విధంగా హాస్టళ్లలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. హాస్టళ్ల నిర్వహణను చీఫ్ వార్డెన్లతో పాటు సహాయ వార్డెన్లు నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా హాస్టళ్ల నిర్వహణ, పర్యవేక్షణపై తరచూ సమీక్షించాలని సూచించారు. విభాగాలు, హాస్టళ్లలో ఎటువంటి సదుపాయాలు అవసరమైనా వెంటనే తమకు ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. విద్యార్థులకు అనుకూలమైన పరిస్థితులు, సదుపాయాలను పూర్తిస్థాయిలో అందించడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు పాల్గొన్నారు.

ఏయూ నిధులు నేలపాలేనా..?



ఎండిపోయిన మొక్క



మట్టి కట్ట వేసి మొక్కను సంరక్షిస్తున్న కూలీలు

- వర్సిటీ గ్రౌండ్‌లో ధ్వంసమైన మొక్కలు
- సంరక్షణ చర్యలకు పూనుకున్న అధికారులు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఉద్యానవన సంరక్షణ వర్సిటీకి అదనపు భారమవుతోంది. 'అమ్మ పేరుతో ఓ మొక్క' అనే నినాదంతో గ్రౌండ్‌లో ప్రత్యేకంగా ఉద్యాన వనం ఏర్పాటు చేశారు. మద్దిలపాలెం వైపు గేటు నుంచి వర్సిటీలోకి వెళ్లే దారికి ఇరువైపులా మొక్కలు నాటారు. వర్సిటీ ఉద్యానవన విభాగం ద్వారా సుమారు రూ. 2 లక్షలు, ఇంజినీరింగ్ విభాగం ద్వారా మరో రూ.35 లక్షల మేర నిధులు దీని కోసం ఖర్చు చేశారు. కానీ ఉద్యానవనంలోని మొక్కలన్నీ ధ్వంసమవుతున్నాయి. సభలు, సమావేశాలు, ఇతర కార్యక్రమాల నిర్వహణకు గ్రౌండ్‌ను అద్దెకు ఇస్తున్న వర్సిటీ అధికారులు, ఉద్యాన వన సంరక్షణపై ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవటంలో అలసత్వం వహిస్తున్నందునే ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్నాయని పర్యావరణవేత్తలు అంటున్నారు.

ఇక్కడ కట్టారు...అక్కడ వదిలేశారు..!



కూల్చిన చోట కట్టిన గోడ


సాక్షి

ఏయూ స్థలాలకు రక్షణేది?

సాక్షిలో ప్రచురితమైన కథనం

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీకి చెందిన విలువైన స్థలాలపై కూటమి నేతల కన్ను పడిందనే 'సాక్షి' కథనాలతో వర్సిటీ అధికారులు మేల్కొన్నారు. పెదవాల్తేరు పోలమాంబ గుడి సమీపంలో కూల్చేసిన గోడను వర్సిటీ అధికారులు యథాతదంగా నిర్మించారు. అయితే ఎవరో కూల్చేసిన గోడను వర్సిటీ నిధులతో నిర్మించాల్సిన పరిస్థితులను చూసిన వారు ఇదేం చోద్యమంటూ గుసగుసలాడుకుంటున్నారు. ఇదిలా ఉంటే, ఇంటర్నేషనల్ హాస్టల్ వైపు కూల్చేసిన గోడను మాత్రం తమకు సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారు. రాత్రి వేళ, కూల్చేసిన దారి నుంచి హాస్టల్ ప్రాంగణాల వైపు గంజాయి బ్యాచ్‌లు వస్తున్నాయని విద్యార్థులు అంటున్నారు. ఒక చోట గోడ నిర్మించి, మరోచోట వదిలేయటంతో ఎవరి ఒత్తిళ్లు ఉన్నాయోనని వర్సిటీ వర్గాల్లో చర్చసాగుతోంది.

సిద్ధాంజనేయ స్వామికి సింధూర అర్చన

మురళీనగర్ : జాతీయ రహదారి సూర్యనగర్ – 2లో వేంచేసిన యోగ సిద్ధాంజనేయ స్వామి ఆలయంలో స్వామిని మంగళవారం సర్వాంగ సుందరంగా అలంకరించారు. అర్చకులు శ్రీకాంత్ ఆచార్యులు ప్రత్యేక పూజలు, సింధూర అర్చన నిర్వహించారు. సన్నిధిలో భక్తులు సామూహిక సుందరాకాండ పారాయణ చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు పెనుమత్స సుబ్బరాజు, కమిటీ సభ్యులు ఎంవీ రాజశేఖర్, భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కమిషనర్ తదితరులు

ఎంవీపీ కాలనీ : గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ క్యాలెండర్‌ను జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. జీవీఎంసీ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు ఆనందరావు సమక్షంలో జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పథకాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లా కిరణ్‌కుమార్ యాదవ్, విశాఖ జిల్లా అధ్యక్షుడు గణేష్‌కుమార్, అశోక్, బంగార్రాజు, రాజేష్, సాయికృష్ణ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు పాతవెంకోజీపాలెం పరస

మద్దిలపాలెం : జీవీఎంసీ 15వ వార్డు పాతవెంకోజీపాలెంలో శ్రీ సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో పరస మహోత్సవం గురువారం నిర్వహిస్తామని సంఘం అధ్యక్షుడు ఆడారి పరదేశినాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న సాయంత్రం 6 గంటల నుంచి పాత వెంకోజీపాలెం ప్రధాన రహదారిపై పరస మహోత్సవం సాగుతుందన్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ సరదాగా గడిపేందుకు ఆట వస్తువులు, గృహోపకరణాల విక్రయం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని చెప్పారు. అందరూ పాల్గొని పరసను విజయవంతం చేయాలని కోరారు.

సదరం శిబిరం ప్రారంభం

సీతంపేట : డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో రామాటాకీస్ సమీపంలో గల ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో సదరం పునఃపరిశీలన ప్రత్యేక శిబిరం మంగళవారం ప్రారంభమైంది. అనకాపల్లి, నర్సీపట్నం, అగనంపూడి ప్రభుత్వ ఆస్పత్రులకు చెందిన ముగ్గురు ఆప్తమాలజిస్టులు పాల్గొని సదరం సర్టిఫికెట్లను, లబ్ధిదారుల దృష్టి లోపాలను తనిఖీ చేశారు. తొలి రోజు 97 మంది శిబిరానికి హాజరయ్యారు. కంటికి సంబంధించి దృష్టి లోపాలతో సుమారు 2500 మంది లబ్ధిదారుల సదరం సర్టిఫికెట్లు పరిశీలించనున్నారు. రోజుకు వంద నుంచి 150 మందికి స్లాట్స్ మంజూరు చేసినట్టు సిబ్బంది తెలిపారు.

శరీర దారుఢ్య పరీక్షకు 485 మంది హాజరు



పరుగులో పోటీపడుతున్న అభ్యర్థులు

ఆరిలోవ: కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ మైదానంలో కానిస్టేబుల్ అభ్యర్థులకు శరీర దారుఢ్య పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించి 485 మంది అభ్యర్థులు హాజరుకాగా 310 మంది రాత పరీక్షకు అర్హత సాధించినట్లు అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలకు చెక్

సీతమ్మధార : రోడ్డు భద్రతా నియమాలు అందరి కుటుంబాలకు రక్షణ కవచాలని, వాటిని పాటించడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చని ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఎస్.అమ్మినాయుడు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమాల్లో భాగంగా నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ దరి హైవే జంక్షన్‌లో మంగళవారం వాహన చోదకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన చోదకులంతా విధిగా హెల్మెట్ ధరించాలని కోరారు. అనంతరం హెల్మెట్, సీటుబెల్ట్ ధరించిన వాహన చోదకులకు వీ హెల్త్ కేర్ ఫ్యామిలీ హెల్త్ కార్డులను సీఐ ఎస్.అమ్మినాయుడు, ఎస్‌ఐ వాణిశ్రీ, ఆర్‌ఎస్‌ఐ ఉమా మహేశ్వరరావు, వీ హెల్త్ కేర్ డైరెక్టర్ కె.ఎం.కె.రమేష్ అందజేశారు.

ప్రత్యేక ఆధార్ శిబిరాలకు స్పందన



శిబిరంలో ఆధార్ వివరాలు నమోదు చేస్తున్న సచివాలయ ఉద్యోగి

సీతమ్మధార : జీవీఎంసీ జోన్ – 3 పరిధిలో ఎంపిక చేసిన సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు మంగళవారం నుంచి ప్రారంభించారు. ఈ శిబిరాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. పుట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆధార్‌కార్డు తీసుకోని పిల్లలకు ఈ శిబిరాలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. పుట్టిన తేదీ, మొబైల్ నంబర్ మార్పులు, చేర్పులకు రూ.50 వసూలు చేస్తున్నారు. బయోమెట్రిక్ నమోదు నిమిత్తం రూ.వంద వంతున చెల్లించాల్సి ఉంటుది. చిన్నపిల్లలకు ఉచితంగా ఆధార్ నమోదు చేస్తున్నారు. ఐదు, 15 ఏళ్లు పూర్తయిన పిల్లలు ఫోటో అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

తూర్పు నియోజకవర్గం పరిధి 17వ వార్డు ఎంవీపీ కాలనీ సెక్టార్ – 1 నేతాజీపార్కులో గల 106వ నంబరు సచివాలయంలో, మద్దిలపాలెంలో గల 117వ నంబరు సచివాలయంలో శిబిరాలు ప్రారంభించారు. ఉత్తర నియోజకవర్గంలోని అక్కయ్యపాలెం దరి లలితానగర్‌లో గల 125వ నంబర్ సచివాలయంలో, పాత రేసపువానిపాలెంలో గల 138వ నంబర్ సచివాలయంలో కార్యదర్శి లోవరాజు ఆధార్ నమోదు చేస్తున్నారు. దక్షిణ నియోజకవర్గంలోని డొండపర్తిలో గల 143వ నంబర్ సచివాలయంలో కూడా ఆధార్ ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని జోన్ – 3 జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ సూచించారు.

కైలాసగిరిపై స్థలాలు ఆక్రమిస్తే చర్యలు



వ్యాపారులతో మాట్లాడుతున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్

విశాఖ సిటీ : కైలాసగిరిపై వ్యాపారాలకు కేటాయించిన స్థలం కంటే ఎక్కువ ఆక్రమిస్తే చర్యలు తప్పవని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ వ్యాపారులను హెచ్చరించారు. మంగళవారం వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో వ్యాపారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటకులతో అక్కడి వ్యాపారులు మర్యాదపూర్వకంగా ఉండాలని, వారిని ఇబ్బంది పెట్టేలా వ్యవహరిస్తే లైసెన్సులు రద్దుకు సిఫార్సు చేస్తామని తేల్చి చెప్పారు. పర్యాటకుల నుంచి అధిక ధరలు వసూలు చేయవద్దని, వ్యాపారులకు వీఎంఆర్‌డీఏ అండగా ఉంటుందన్నారు. కైలాసగిరిని మరింత అభివృద్ధి చేసేందుకు పలు కీలక ప్రాజెక్టులు తీసుకొస్తున్నట్లు చెప్పారు. పర్యాటకులు వస్తేనే వ్యాపారాలు సాగుతాయన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని సూచించారు. కొండపై సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ కార్యదర్శి మురళీకృష్ణ పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



దీక్షలో సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం : పోర్టు హాస్పిటల్ టెండరు పేరుతో ఎవరు వచ్చినా అడ్డుకుంటామని, ప్రైవేటీకరణను ఆపే వరకు పోరాడతామని సీఐటీయూ అధ్యక్షుడు జె.సత్యనారాయణ తెలిపారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 113వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్టు హాస్పిటల్ టెండర్‌కు ఎవరొచ్చినా తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్మికుల కృషితోనే ఆస్పత్రి అభివృద్ధి చెందిందన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలతో కలిసి ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కె.సత్యనారాయణ, సీహెచ్ త్రినాథరావు, కేఎస్ కుమార్, శ్రీను, రాఘవులు, కె.విజయారావు, నర్సింగరావు పాల్గొన్నారు.